# హంస ధ్వని

“ఏంరా మామా! ఇక రేపటినుంచి పదిహేను రోజులదాకా కాలేజీముఖం చూడనక్కరలేదు కదా!....సెలవుల్లో ఏం చేద్దాం....” అన్నాను.

“చేయదగ్గ దేమిటోయ్!....కళ్ళు మూసుకు తెరిచేటప్పటికి మళ్ళా బడీ.... మనం. వాటంతట అవే రెక్కలు గట్టుకు మేఘాలమీద ఎగిరిపోతాయి. నీకేం ఆ దిగులక్కరలేదు ఎలా గడుస్తాయా అని....” రంగశాయి....చులకనగా సమాధానం యిచ్చాడు....తల ఎత్తకుండా....కలం ఆపకుండా.

“ఇఖ....సంక్రాంతి పండుగలని....దేవరవారికి తెలుసునా....?” మంగయ్య - తల ఊగించినట్లుగా (మంగయ్య అంటే....మా లాడ్జి ఆసామి) తల ఎగురవేసి.... నాకు నవ్వు తెప్పించి.

"అవునురా....అందరూ....అంటే నీవు సహా .... మూటాముల్లే కట్టుకుని అత్తవారిళ్ళకు బయలుదేరుతారు .... ఆ సరదా....నాకూ ఉండేదికాని .... ఒంటికి సరిపడలా .... ఖాయిలా చేసింది. అప్పటినుంచీ....గప్ చిప్...." అని కళ్ళతో నవ్వాడు.

"నీ పెళ్ళి అయి....రెండేళ్ళేగా...."

"ఆఁ....ఆ యేడాదిలోనే....ఈ ముచ్చట...."

"అంటే...."

"అందుల కొక్క గాథ కలదు....అది ఇప్పుడు తెమలదు...." శుకసప్తతి పద్యాన్ని చెడగొడుతున్నాడు....

"టూకీగా చెప్పరా....రేపు నే నుండను...."

"అదృష్టవంతుడివి సోదరా!....పోయి, హాయిగా, కాటూరి రాయని తేట గీతల్లో అర్థమంతా అనుభవించి మరీ రా....లేనివాళ్ళకు ఏలాగూ లేనేలేదు!"

"లేకపోవడ మేమిటి, నీ ముఖం....అత్తవారింటికి కొత్తల్లుడు వెళితే....నెత్తిన పెట్టుకుంటారు, కాని...."

"పెట్టుకునేవారే....కాని...."

"అనగా...."

"కథ చెప్పవలసి వస్తుంది ఖబర్దార్—"

"చెప్పవోయ్, అయితే....ఎందుకన్నా మంచిది....మనం ఆ పనిమీదనే గనుక వెళ్ళేది...."

"నీకు అంత అతితెలివికి పోవడం ఎక్కడ చాతనవుతుందిలే .... అయినా, విను....విన్నందువల్ల నీకు మహా వచ్చేదీలేదు...."

"నీకు పోయేదీలేదు."

"ఇదివరకే పోయిందనే....యిందాక విన్నవించుకున్నది .... అవును, పోక ఏం చేస్తుంది...."

"హరిః ఓం—పండుగకు తప్పకుండా రావాలనీ....ఈ ఉత్తరమే టెలిగ్రాము క్రింద భావించవలసిందనీ....మా మామగారు అప్పటికి నెలరోజులనుంచీ....ఉత్తరం

మీద ఉత్తరం. ప్రతి ఉత్తరంలోనూ ఈలాగే నాకూ పోస్టు వాళ్ళకీ కూడా విసుగు వచ్చేట్టుగా రాశాడు....ఆయనకన్న మన కిక్కడ ఎక్కువ అదుర్దాగా ఉంది....

ఆ అమ్మాయి డి. యం. సి. పుస్తకాలు కొనుక్కుని వస్తూంది. నేను కూడా అనుసరించాను. మరో ఉద్దేశ్యమేమీ లేదు....మన కారువాళ్ళకి అది మామూలే కదా........

ఎప్పుడు సెలవలు వస్తాయా అని....ఇంక కొన్ని ఘడియల్లో, తినబోయే వాడికి....ముందుగా రుచుల జాబితా యివ్వడం ఎందుకూ ? - సరిగ్గా....నీవు యిప్పుడా....ఏమేమని మనసులో అనుకుంటున్నావో .... అంతకు వేయిరెట్లుగా ఉవ్విళ్ళూరాననుకో....అవునోయీ....అదే, తొలిసారి పండుగకు .... అత్తవారింటి కంటూ వెళ్ళడం.

తప్పకుండా రాగలవాడను అని ఒకసారికి ముమ్మారు వ్రాశాము. అంతకూ నమ్మకంలేకనో ఏమో ఏమని విన్నపాలంపుకున్నాడో, మా నాన్న పనివేళా నన్ను ప్రయాణం చేయడానికి తయారైనాడు యిక్కడికి. అమ్మా వాళ్ళూ అక్కడనుంచీ అలాగే యకాయకీ మేము వచ్చేనాటికి అక్కడికి జేరుకుంటారట. సరే అంటే సరే నన్నాను....

"కాని అనుకున్ననాటికి బయలుదేరడం పడింది కాదు. ఆ నెపం కాలేజీవాళ్ళ మీద వేశానులే. ప్రైవేటు క్లాసులు యిత్యాది కారణాలు చెప్పినా మా నాన్నచేత, వాళ్ళనో లక్ష తిట్టించాను. యిద్దరమూ రాకపోతే అక్కడ అటూ అత్తవారూ, అమ్మా వాళ్ళూ ఏమన్నా అనుకుంటారు. కనుక నీవు ముందు అనుకున్నట్టుగా బయలుదేరు. వెళ్ళేటప్పుడు నా సూట్ కేస్ వగయిరాలు కూడా తీసుకు వెళ్ళావా అంటే నాకు అట్టే బాదరబందీ ఉండదు. యిక్కడ బడి అయిపోవడంతోనే తక్షణం రైలెక్కుతాను" అని గంటసేపు స్వస్తిచెప్పి ఏలాగైతేనేం ఆయనను ఒప్పించి పంపించాను. దవనం, మరువం, పెద్దదేమంతి, ఇంకా ఈలాటి దినుసులన్నీ ఓ బండెడు సామానుకైతే చెప్పి అవి మాత్రం తప్పకుండా వచ్చేటప్పుడు తీసుకురమ్మని మరీ మరీ నాతో చెప్పి మా నాన్న బయలుదేరి వెళ్ళిపోయినాడు. అసలు మనం ప్రయాణం మానడానికి ముఖ్య హేతువు చదువూకాదు, పాడూకాదు. మరునాడు రుషియా ఓపెరా కంపెనీ దిగుతూంది. ఉండి చూద్దామని, అందుకనీ ! అసలు సంగతి చెపుతే, ఆయన ఒప్పుకునే వాడంటావా ?—

ఒక్కమారే, సీజనుకు అంతా టిక్కెట్టు కొనేశాను. చేతులో పైసా ఆడుతున్నదిగా, ఆ వార, దవనం, మరువం యిత్యాదులలో తగ్గించవచ్చును. చాలా సరదాగా గడిచినవి ఆ నాలుగు రోజులూ....

కావలసినవన్నీ మా నాన్న చెప్పినంత భారీగా కాకుండా, దగ్గిర ఉన్న డబ్బుకు సరిపోయేట్టుగా ముత్తసరిగాకొని పార్శెలు చేయించాను. పేసింజరులో నేను రికామీగా చేతులు ఝాడించుకుంటూ అత్తవారి ఊరులో దిగాను.

దిగటంతోనే అటూయిటూ చూశాను, ఎవరన్నా వచ్చారేమోనని. ఎక్కడా నాలుగుమూలలా, ఎరుగున్న మొగం ఒక్కటీ కనిపించలేదు.

అసలు మా మామగారే నన్ను రిసీవ్ చేయడానికి తప్పకుండా రారా అనుకున్నాను. ఆయన రాకపోవడంతో కొంతవరకూ ఆశాభంగం అయింది. తాను రావడానికి ఏ సందర్భముచేతనైనా వీలులేకపోవచ్చును, కాని ఎవరో ఒకనిని పంపడానికేం? ఊరికి వచ్చినవాడు, యింటికి రాకపోతాడా అనే ధీమాలో వున్నారు గదా సరి. కానీ, వీళ్ళపని పడదాం అని అల్లుడితనంలో నాకు ఆవేశము ఎత్తుకు వచ్చింది. అసలు వెళ్ళకుండా మానేసి ఆ పూట హోటలులో భోజనంచేసి తిరుగుబండి యెక్కి కూర్చుందాము అనుకుంటే అందుకు రెండు ముఖ్య అవాంతరాలు వచ్చినాయి. ఒకటి : మన చేతిలో మళ్ళా తిరిగి యిక్కడకు జేరుకునేందుకు చాలేటంత డబ్బులేదు ఇంకొకటి : మా నాన్న ఊరుకోడు.

అందుచేత, సాపుగా ఎగవేయడం అనే ఉద్దేశ్యము ఉపసంహరించుకుని చాలా ఆలస్యంగా, భోజనాలవేళ మీరిపోయిన తరువాత అక్కడకు జేరుకుంటే అప్పుడు వాళ్ళు మళ్ళా వంటచేసి పెట్టవలసి వస్తుంది. ఆ మాత్రం శిక్షతో ప్రస్తుతం పోనిద్దామనుకున్నాను. 'యిప్పు డెలా వచ్చావు. రైలేం లేదే' అని అక్కడ ఎవరో ఒకరు అడుగక మానరు. సరే, మనం జవాబు చెపుతాము. 'రావడం ఉదయానే వచ్చాను కాని, యిల్లు కనుక్కోవడం చెడ్డ గగనమైపోయింది. తిరిగీ తిరిగీ ఎందరిని అడిగినా ఎవరూ సరిగా చెప్పందే.' దాంతో అందరూ 'అయ్యో—పాపం' అనక తప్పదు. మామగారికి, యిందులో అర్ధం నసాళానికి తగిలి చేసిన పొరపాటుకు, తప్పక నాలుక కొరుక్కుంటాడు, ఈ తఫాకు యింతటితో వదిలిపెడదాం అని నిశ్చయం చేసుకుని మళ్ళా ఇంకోసారి కాఫీ, యిడ్డెన్లూ మేసి పత్రికలు కొనుక్కుని చదువుకుంటూ వెయిటింగ్ రూములో పడుకుని ఏ రెండు గంటలకో నింపాదిగా బయలుదేరవచ్చును కదా అని బుక్‌స్టాల్ దగ్గిరకు వెళ్ళాను.

అక్కడ ఒక అమ్మాయి నిలుచుని డి. యం. సి. పుస్తకాలు తిరగవేస్తూన్నది. అమ్మాయి అంటే ఏ పన్నెండేళ్ళో ఉంటాయి. అయితే పిల్ల మాంచి ఏపుమీద గుమ్మటంలాగా ఎదిగివస్తూంది. ఏడాదికో, రెండేళ్ళకో ఇక చేసుకున్నవాడి పంట పండుతుంది. నాజూకుగా, బొద్దుగా చాలా అందంగా ఉంది. అంతకన్నా జుట్టు నొక్కులు నొక్కులుగా ముఖ్యంగా ఆ చిన్నదాని జడ చూచి నేను ఆవేపు పరకాయించి చూశాను. మన గాలీ, నీడా సోకి ప్రక్కన ఎవరా అని కాబోలు నావేపు తిరిగి చూసింది. చదువుకుంటూన్న కుర్రది గనుక చటుక్కున ఒళ్ళు కుదించుకోవడం, సిగ్గుపడి ఎగిరి గంతువేయడం యిలాటి మామూలు చేష్టలు ఏమీ చేయకుండా నిదానంగా కొనుక్కునేవి కొనుక్కుని ఊరికేనే నా వంక మరోమారు చూసి వెళ్ళిపోతూన్నది.

నాకు ఎలాంటి దురభిప్రాయమూలేదు సుమా. పసి పిందె అని ముందుగానే విన్నవించుకుంటినిగా! ఉట్టి బులభాటంతో పుస్తకాలు అమ్మే ఆతడిని 'ఎవరు ఆ అమ్మాయి—' అని విచారించాను. ఆ సోదరుడు, వేరే అర్థం చేసుకుని నామీద కొరకొరలాడి చిల్లర నా ముందుకు నిర్లక్ష్యంగా విసిరివేశాడు. మళ్ళా కదిలించితే, మర్యాద దక్కేట్టులేదు. ఎందుకు ఏదో చిల్లరమాట పడటం, మనం ఏ పాపమూ పుణ్యమూ ఎరుగకపోయినా, పత్రికలూ, పుస్తకమూ చంకను పెట్టుకుని చిల్లర పక్క జేబులో వేసుకుని అక్కడనుంచి కదిలాను.

తీరుబడిగా ప్లాట్‌ఫారం కొలత వేయడం మొదలు పెడితే దానితో కొంత పొద్దుపోతుంది. కూర్చుని చదవటం అంటే ఎంతసేపని చదువుతాం కనుక. అందులో ఎప్పుడూ, చదువుకూ మనకూ సగం ఎరికే అయెను! - మాంచి గమకంగావుండే బొమ్మలు ఎగాదిగా చూడటం, తరువాత పుస్తకం, పత్రికా మూలపారవేయడం నీకు తెలియనిదేమున్నది మన విషయం.

ఆ పిల్ల వెళ్ళిపోయిందనుకున్నాను. కాని లేదోయ్. షెడ్‌లోపల జీడిపప్పులు బేరమాడుతూంది. నాకు నోరు పురపురలాడింది. కొని, జేబులనిండా పోసుకున్నాను. ఒక్కొక్క పలుకే తింటూ గోడలమీదఉన్న నిలివెడేసి ప్రకటన బొమ్మలు చూస్తూ అక్కడే నిలుచున్నాను....

ఆ అమ్మాయిలో యిందాకటికన్న ఎందుచేతనో కొంచెం కులుకు ఎక్కువయిందోయ్. నేను కనిపెడుతూనే ఉన్నానులే: చూపు ఊరికే అటూ యిటూ

కొండాడుతూందన్నమాటే కాని, మన ధ్యాస అంతా అటువేపే ఉంది. అంటే, వేరే మరేంలేదు. ఆ పిల్ల ఎందుచేతనో అంతగా నన్ను ఆకర్షించుతూంది.....

నడుస్తూంది. నేడూ....

అలా అనుసరించడంలో కూడా మరో ఉద్దేశమేమీ లేదు. పట్టి సరదా. మన కారువాళ్ళకు అది మామూలే కదా....

జీరాడే పావడా చెప్పు కాలికి బందాలు పడింది కాబోలు నడక జెసకడంలో పుస్తకాలు క్రిందపడి చేతి పొట్లంలో జీడిపప్పులు చెల్లాచెదరైపోయినాయి పాపం. ఆ అమ్మాయివి....

అప్పుడు మనకు అనుకోకుండా అదృష్టం కలసి వచ్చింది. ఆమెకన్న ముందుగా నేను అవన్నీతీసి, దుమ్ము దులిపి—అంటే, పుస్తకాలే. జీడిపలుకులు అలాగే వదిలివేశాను—ఆమెకు అందిచ్చి ఒక్క అంగలో ఒక్క నిమిషంలో యింత నిర్వాహకం చేశాననుకో. మరి మీ మిత్రుడేం సామాన్యుడనుకున్నావా ఏమిటి?

శివల్‌రీ—

కృతజ్ఞత—

ఏవీ కావు. నేను సంకోచించకుండా వెంట నడవడానికి ఆ అమ్మాయి నవ్వు మొగం చేసుకోవడానికీ సందు చేసుకోవడం మనసు సరిపెట్టుకోవడం తప్ప మరేమీ కాదు—

ఎంత సేపు?—ఎంతదూరం మౌనంగా అలా నడవడం....

ఏలా మాటలలోకి దించడం....?

ఊళ్ళోకి ఎంతదూరం ఉంటుంది. ఆ కనపడే పెద్ద మేడ ఏమిటి? రోడ్లు అన్నీ యిలాగే ఉంటాయా దుమ్ముకొట్టుకుంటూ? నిన్న ఇక్కడ ఏమన్నా చినుకు పడ్డదా? నేను బయలుదేరేవేళకు మదరాసులో కారుమబ్బులూ, కుంభవృష్టి. అవును అక్కడనుంచే రావడం. లా చదువుతున్నాను. పరీక్ష అయిపోయిన తరువాత ఏమీ చేయాలనిలేదు. అవసరంలేదు సంపాదించాలని. ఆం ఫరవాలేదు. భాగ్యవంతులమంటే లక్షలు మూలగటంలేదు కాని కాని....

పెళ్ళి యింకా కాలేదు. చేసుకోవాలనే ఇష్టంలేదు ఇప్పుడప్పుడే. ఏమిటో అసలు యిలా పూర్వకాలపు రకంగా ఎక్కడనుంచో ముక్కూ మొగం ఎరుగని

ఎవతెనో తీసుకువచ్చి, పెద్దవాళ్ళ మెడకు తగిలించితే మెదలకుండా అదే రంభ అనుకుంటూ, పిల్లలను కంటూ, యింట్లో పడివుండటం ఇలాటి వేషాలేమీ మన దగ్గిర సాగవు. మా వాళ్ళకు కూడా నేనంటే హడలు. నా దగ్గిర అవేమీ ఎత్తరు.

ఇలాగే ఒకటేమిటి, నోటికి వచ్చినట్లుగా వాగానసుకో. కోతలు కోయడంలో, అబద్ధాలాడటంలో నేనేమీ వెనుదీయలేదు. సరి, ఆ సందర్భము అలాటిది!

"ఎలాగో అలా మాటాడించడానికి అని అంటీముట్టని ప్రశ్నలు ఊరు భోగట్టాకు సంబంధించినవి రెండు మూడు మచ్చుకు వేసిచూసి, ఆ అమ్మాయి బెరుకు లేకుండా జవాబు చెపుతూంటే ధైర్యంగా ఆమె నన్ను తిరిగి ప్రశ్నించుతూన్నదన్న స్పృహ కూడా లేకుండానే అడిగినదానికి అడిగేదే తడవుగా ఉన్నవీ లేనివీ....

ఆఁ, పెళ్ళి కాలేదని ఎందుకు అన్నానంటే అయిందని ఒప్పుకోవడం ఎందు చేతనో నామర్దాగా తోచింది. ఇంతకూ కీలకం ఏమిటంటే ఆ అమ్మాయితో మాటాడుతూన్నకొద్దీ మాటలు మొదలు పెట్టినప్పటినుంచీ ఆ పిల్ల సానిపాప అయివుంటుందనిపించింది. వేషం ఒక్కటేకాదు, కులాసాగా డీ అంటే డీ అని జవాబు చెప్పే ఆ ధోరణీ, కులుకూ, వయసుకు మించిన తెలివిచిమ్మే ఆ కళ్లూ వేయేళ్ళు తపసు చేసినా మన వాళ్ళకు అబ్బుతాయా? అందుకు వాళ్లే పెట్టిపుట్టారు. అందులోనూ చదువుకుంటూన్న దానిలాగా కూడా ఉన్నదా ఇకనేం!

చాలాదూరం నడిచాము. అప్పుడు అనిపించలేదులే, ఎంత సేపటినుంచి నడుస్తూన్నదీని! నా జేబుల్లో జీడిపప్పులు కూడా చాలాభాగం అయిపోయినాయి. మాటలసందునే ఎప్పుడో యాదాలాభంగా 'యింద' అని యివ్వడం మొదలుపెట్టి వుంటాను. దోవపొడుగునా ఇద్దరమూ బొక్కుతున్నా మన్నమాట.

అంత సేపటినుంచి చూస్తూండటం, సరసను — చెట్టా పట్టాలు వేసుకోవడం మినహాగా, రాచుకుంటూ నడవడం, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఉండటం, ఇన్ని కారణాలమీద ఆ అమ్మాయి సహవాసం ముచ్చటగా నాకు ఉన్నదనుకోవడంలో ఆశ్చర్యపడవలసినదేమీలేదు. పైగా, నా కన్న ఎక్కువ చొరవ - మనం ఎంతగానో నేర్చుకోవలసివున్న మరియాద! - వదలబుద్ధి పుట్టటంలేదు.

వాళ్ళ యింటికి వెళితే! — అప్పుడు తోచింది ఆ ఆలోచన. నా అదృష్టం బాగుండి, ఆ అమ్మాయికి ఓ అక్కయ్య అంటూ వుండి - ఎందుకు వుండదు?

ఉంటుంది. యింతకన్న లేక, యింతకూ వాసి తక్కువ అయినా కొత్త వయసులో రంభను మించేట్టు ఉండితీరాలి! - నాకు, అంతకన్న ఏం కావాలి?

పండుగ!—అత్తవారి యిల్లు—యిల్లాలు! అవన్నీ మనసులోనుంచి తుడిచి వేసుకుపోయినవి. చౌడయ్య చెప్పినట్లు పండుగ దినము అలా రాజరంగేళీగా మనకు ఆ ఊరిలో అయే యోగం వుండగా అత్తవారిల్లూ — కొత్తబట్టలూ - చచ్చుసంభావన దక్కకపోతేనేం! — ఏమంటావు?"

"ఏంరా? యిది కలా, కథా?" ఊపిరి వదలడంకోసమనిగాని నేను ఆ ప్రశ్న వేయడానికి అవసరం ఏంత మాత్రమున్నా అప్పుడులేదు. "కథకాదు ప్రభూ! వ్యథ" అని అక్షరాలు నొక్కుతూ జవాబు చెప్పాడు రంగశాయి - ఆలోచనాభారంతో లాగు, తల మెడతోసహా ఒకవైపు ఒరగనిచ్చి వాడు చూడకుండా వాడివైపే నిదానించి చూశాను. రెప్పలమీదుగా అప్పుడు తలఎత్తి ఉలికిపడేటట్టు చూస్తూ "తరువాత ఏం జరిగిందో చెప్పనా?"—అన్నాను. రంగశాయి సైఁ అన్నాడు.

"సరే ఆ ప్రకారంబున ఉభయులూ కలసి నడుస్తున్నారు. మాటల మెలికలతో మనసులో సమాధానాలు ఒడిసిపట్టి అతి నేర్పుతో తనకు కావలసిన కూపీ అంతా తీశాడు ఆ ప్రచండుడు: ఆ అమ్మాయికి ఒక అక్క వున్నమాట నిజమే. ఆ అక్క, తాను ఊహించిన దానికన్న కూడాను ఎన్నోరెట్లు చక్కనిచుక్క అయిన మాటా నిజమే....చాలా చాలా తెలివీ, చదువూ వాటిని మించిన సరదా, కలుపుగోలుతనమూ, ఏవంగుణ విశేషణ విశిష్టగా అప్పుడే కాగి తేరుకుని ఘుమాయింపుమీదవున్న ఆ అవు నేతిలో ఇఁ ఈ రొట్టె విరిగిపడటమే అవశిష్టం. ఇదంతా వాకబు చేయడం అయిన మీదట నాయకుడు చేరుకున్న నిశ్చయము - అంతవరకూ కరెక్టేనా?"

"అవునో కాదో ఆఖరుకు చెపుతాను, సాంతం అల్లు—"

"అల్లికే అయితే యింత పలచగానే!—అసలు కథ గనుక మెరుగు తీసుకు రావడానికి కృషి లేకుండా — నడిపేస్తున్నాను."

"నీ చిత్తం — సాగదీయక త్వరలో తెముల్చు."

"జీ, హుకుం. అయితే అక్కడక్కడ చుక్కలు పెట్టేస్తాను - అఁ ఎందాకా వచ్చాము?"

"నేను, మధ్య మధ్య జ్ఞాపకం చేయవలసి వస్తూంటే యీ మాత్రానికేనా,

తగుదునంటూ అడ్డంకొట్టింది - నవవడంలేదని ఒప్పుకోరాదూ పెద్దమనిషి తరహాగా ?——"

"అభ్యంతరం ఏమీలేదు కాని, పాడుచేస్తానని భయం, నీకు వదిలిపెడితే! - నిన్ను ఒక ఊపు ఊపిచూద్దామని కాని యీ మాత్రానికే తడుముకునే బాపతా, మన తాహతు నీకు తెలియదూ. అలనాటి సుబ్బన్న దీక్షితులకు, కరెంట్ అపరావతారాన్ని అనే మాట మరచిపోకూడదు మరి. స్వోత్కర్ష ఎందుకుగాని ఆవలి కథాక్రమం బెట్టిదనిన....

ఇద్దరూ, వాళ్ళ యింటివేపే వెళ్ళారు. దోవలు చీలిపోయి, ఎవరిదోవ వారు కావలసివచ్చే విషయం ముందుగానే గ్రహించి నీవు మరికాసిని అబద్ధాలుఆడి తనకు ఆ ఊరు కొత్త, ఫలాని చోటికి అప్పుడే వెళ్ళాలంటూ అగత్యం లేకపోవడం యిత్యాదులు 'అలా అయితే మా యింటికి ఎందుకు రాకూడదూ' అని ఆ అమ్మాయి చేత అడిగించుకుని, మొగమాట పడినట్లు నటించి కొంత నాటకం జరిగినమీదట వాళ్ళని పావనం చేయడానికి అన్నట్లు - ఒప్పుకొని కలలమీద కలల దొంతర పేర్చు కుంటూ గుమ్మం ఎక్కేటప్పటికి యెదురుగుండా వచ్చి, — ప్రత్యుత్థానం చేసింది ఎవరు ? - మీ మామగారు! ఆ జీడిపప్పు భాగస్వామిని మీ పినమామగారి కూతురు. అదీ జరిగిన ప్రమాదం. మీ మామగారు ఆ ఊరికి బదిలీ అయిన తరువాత అదే నాయెను నీవు వెళ్ళడం. ఎక్కడ ఉన్నారో తెలియదు నీకు. మీ మరదలు కుర్రదాన్ని నీ పెళ్ళప్పుడు చూచావు అంతే. ఆడపిల్లలు నిమిషంలో యిట్టే అనవాలుపట్ట వీలు లేకుండా ఎదుక్కువస్తారాయెను. అందువల్ల నీవు అన్ని కారణాలు అలా కలిసివచ్చి నందువల్ల దెబ్బ తిన్నావుకాని, లేకపోతేనా? అప్పటికైనా చెక్కు చెదరినట్లు అగు పించావా? - వాళ్ళలో వాళ్ళు గుసగుసలుపోవడం, నిన్ను చూడనట్లుగా ముసిముసిగా నవ్వడమేకాని, మొగంమీద అడగడానికి - నీవు చేసిన అపరాధం ఏముందని, నిజానికి ? — మీ మామగారు నీ రసజ్ఞతకు పొంగిపోయి ఉండాలి. కాని, నీకే ఉండ టానికి మొగంచెల్లక, అప్పుడే తిరిగి వెళితే బాగుండదు గనుక, ఆ రోజంతా బల వంతాన ముళ్ళమీద ఉన్నట్టు ఏలాగో గడిపి - పరీక్ష ప్రశ్నలు అందరికీ ముందే తెలిసి పోయినట్లు అధికారులకు అనుమానం తోచడంచేత మళ్ళా పరీక్ష చేయదలచుకున్నారని నీకు అతి రహస్యంగా ఆ ప్తుడొకడు అతి వాస్తవికంగా కబురు ఆ పూటే చెప్పాడని, అందుకని తక్షణం వెళ్ళిపోయి కంటిమీద రెప్పవేయకుండా అంతా చదివితేనే తప్ప - గట్టెక్కడం కష్టమనీ మీ నాన్ననూ, మామగారినీ నమ్మించి - మీ నాన్న అప్పటికే

వచ్చివుండాలనే సంగతి నేను మరచిపోయినా ననుకున్నావు గామాలు, లేదోయ్ సోదరా! యిక తోక మడత పెట్టావు. పండుగ సరదామీద సంకురుమయ్య ఆ యేడు ఆ విధంగా స్వారి చేశాడు - నీ కళ్ళు బయటపడుతూన్నందుకు నీకు కష్టం తోచ వచ్చునుగాని నేను నిజమని నమ్మినదానిని దాచకుండా చెప్పాను - సారీ—"

తలయెత్తి రంగశాయివంక చూడగానే మనసు చివుక్కుమన్నది. పాపం వాడి మొగం చిన్నబోయింది. అతి తెలివికి ఎందుకు పోయినానా అని తగని కష్టం వేసింది. 'ఏంరా మామా' అని బెదురుతూ భయంతో పలుకరించాను. వాడు నా వంక చురచుర చూసి పకాలుమని పగులబడ్డాడు - "సారీ నీవు చేసిన ఘనకార్యానికి మా లావు కథ అల్లాననీ నేను—సారీ యా, నీ మొగం లాగున్నది. యింత చచ్చుగానా— యీ మాత్రానికి అయితే చలించేవాడినా ఎన్ని గమ్మత్తులు చేసేవాడిని! అదికాదు ఆ అమ్మాయివెంట, లాషాలాగా తగులుకుని వాళ్ళ యింటికి వెళ్ళాను. అంతవరకూ నీ ఊహ నిజమే, అంతే.

నేను అనుకున్నది నిజం. వాళ్ళు చాలా మర్యాదలు చేశారు. ఆ అమ్మాయి అక్కయ్య చాలా బాగుంది. ఆవాళ అక్కడే ఉండిపోయాను. తెల్లవారేటప్పటికి ఒళ్ళంతా పళ్ళికలు, గంగాజలం అనుకుని కళ్ళు మూసుకుని కాలకూటంలో నిలువునా మునిగాను. ఏమనుకుంటే మాత్రం ఎవరిని ఏమన్నా ఏం ప్రయోజనం? - కట్టినతేలు గుణవంతురాలు.

సానివాడనుంచి సరాసరి—బండిలోపడి ఏలా హాస్పిటలు జేరుకున్నానో పరమాత్ముడికి ఎరుక. దగ్గరవున్న పైసా బహుంకొద్ది - ఊరులోనో ఎవరి ముక్కూ- మొగమూ ఎరుగను. ఉన్నస్థితి అదీ. అయినా అధైర్యపడినందువల్ల ఒరిగేది ఏమీలేదు గనుక అలాగే మొండివేసి ఓ మూల ఒళ్ళు తెలియనంత ఉష్ణం సలుపూ పోటూ నిండుగా మణిగి ఉన్నాను :

నా పాలిటి దేవుడల్లే అక్కడ డాక్టరువాళ్ళ తమ్ముడూ నేనూ చిన్నప్పుడు చదువుకున్నాం. అయన కొత్తగా అక్కడకు బదిలీఅయి వచ్చాడుట: నన్ను చాలా ఆదరించి చివాట్లు పెట్టి ఎంత గొడవ చేస్తాడో అని బహు భయపడ్డాను సుమా! ఏం ఫరవాలేదని నాలుగో నాటికల్లా యింజక్షన్లతో ఆ ఉద్ధృతం తగ్గించేశాడు....

"వెంటనే తిరిగి యిక్కడకు వచ్చేశావు."

"అంతేనా మధ్య యింకా ఉంది : రెండు రోజులైన తరువాత ఆవాళ

మధ్యాహ్నం వార్డుబాయ్ వచ్చి 'మీ వాళ్ళు చూడటానికి వస్తున్నారు' అన్నాడు. విని వినడంతోనే పడుకున్నవాడినల్లా అపాళంగా అలాగే నిలువెత్తున ఎగిరిపడ్డానంటే నమ్మ. మా వాళ్ళకు ఎలా తెలిసింది. యింకేముంది, కొంప మునిగింది గజగజలాడి పోతూ అప్రయత్నంగా 'ఎవరు' అన్నాను. అర్థం కాలేదు; నా భార్య, బొడ్డూడని పిల్ల యింకా—ఒంటరిగా వాళ్ళ వాళ్ళు యిక్కడికి పంపిస్తారా ? - పోనీ మన ప్రయోజకత్వం తెలుసుకుని అభినందించడానికి తెగించి వచ్చిందేమో అనుకుంటే, తెలుగుపిల్ల కేమిటి అంత తెలివి తేటలూ దొరవానా? - ఎన్నిమాట్లు పుఠంవెయ్యాలి! నేను అనుకున్నదంట్లో సబబు విశేషంలేదు. కాని అప్పట్లో ఆ ఒడిదుడుకు తగిలేటప్పటికి మెదడు అలా పనిచేయడం మొదలుపెట్టింది—సరే, వచ్చినవారు ఎవరైతేేం - కాళ్ళబడ్డ పాము కరవక మానదుకదా — పులి నోటిలో తల యిరికి ఉన్నప్పుడు పుట్రకు వెరుపు ఎందుకూ. వస్తారు. చూస్తారు చూడనీ! అని గుండెకు నిబ్బరం తెచ్చుకుని ఊరుకున్నాను.

ఎవరనుకున్నావు వచ్చింది? — ఎవరో చెప్పుకో — ఎవరూకారు. మనం గంగలో దిగడానికి కారణభూతయైన ఆ 'కల్యాణ కల్పతరువు' - నదురూ బెదురూ లేకుండా: ఏ మొగం పెట్టుకుని వచ్చింది?—ఏమని వచ్చింది.

'ఎలా ఉంది' — దగ్గిరకువచ్చి — కుర్చీ మంచం ఓరకు లాక్కుని కూర్చుని తల నిమురుతూ అడిగింది — నాకు వళ్ళు భగభగలాడింది.

'దివ్యంగా ఉంది' అని విషంగా అన్నాను. కళ్యాణి సిగ్గులేకుండా నవ్వింది - చెంపపగిలేట్టు కొట్టడానికి - లేవడానికి శక్తిలేక ఊరుకుని అక్కసుతో మూలిగాను. ఎన్ని విధాలో పలుకరించింది. నేను బెల్లంకొట్టిన రాయిలాగా తామసం దిగమ్రింగుకుంటూ, పళ్ళు బిగించి, కళ్ళు మూసుకుని అటు తిరిగి పడుకున్నాను. ఎందుచేతనంటే విన్నకొద్దీ, మనసులో సలుపు ఊట - మెలిక వేస్తూంది. పట్టలేక నోరు విప్పితే మన సంగతి ఇంకా నలుగురికి తెలిసి ఉన్నదానికి ఉపరి మరీ ఖరాబు అవుతుందని - శక్తికి మించినంతగా కూడా తమాయించుకుని యిక కట్టలు తెగిపోతవని ఆ భూతం అక్కడి నుంచి వదిలిపోతుందేమోనని అలా అటు తిరిగి పడుకునే - 'సిగ్గులేదా' అన్నాను - అంతటితో రోషంవచ్చి అయినా వదిలిపోతుందికదా అని. కాని అచ్చుమయిన సాని అంతమాత్రానికే లొంగుతుందా?

"సిగ్గు—ఎవరికి?" గద్దించినందుకుకాదు, వెక్కిరింతగా అడిగిందని రోషం

ఎక్కింది నాకు. 'పో' అని ఉరిమాను. 'పోను' అని ఆ స్థాయిలోనే ఆమె జవాబు యిచ్చింది—కింక ర్తవ్యం ?

"పొమ్మంటే పోయేదాన్నయితే - ఈ ఛాయలకే అసలు రానేరాను. అసురుసురనడం అందరి గృహస్థులకూ పరిపాటే. అలనా పాలనా చేసేందుకు నా లాటిది దొరకడం అదృష్టమనుకుని కళ్ళనద్దుకోక కస్సుమంటారేం? - బొట్టూ కాటుకా పెట్టి పిలిచానా ఓ మారు వచ్చి మా యిల్లు పావనంచేసి పొమ్మని? యిప్పుడైనా పొమ్మంటానా - రమ్మంటానుగాని!"

"వచ్చినందుకు బుద్ధి వచ్చింది—" అన్నాను - ఆమె అందుకూ నవ్వుతూనే "బుద్ధికి బుద్ధంటూ వుంటేనా రావడానికీ పోవడానికీని? - మాటకు మాట పలకడం నేర్చారుగాని రద్ది కెక్కకుండా మరియాదగా మాన్చుకోవడం నేర్పరో? - మా దొడ్డ సరసులు! మారాం చేయకుండా సాయంకాలం వచ్చేసేయండి. మా చెల్లాయిని పంపుతాను. అదే సరి, మీకు ముక్కుకు తాడుపోసి లాక్కువచ్చి నా గదిలో కట్టేస్తుంది—"

అని వెళ్ళిపోయింది ప్రభూ! యీ సోదరుడు ఆలాగే సాయంకాలను అక్కడికి జేరుకున్నాడుం అవును, కాదు అనడం మరి, మన చేతులో ఉంటేనా. అదీగాకుండా అసలు కారణం మనకు నోటి పురపుర యింకా తీరలేదు.

సరే, మకాం అక్కడ, మందు హాస్పిటలులో. పది హేనురోజు లున్నావనుకుంటాను అలా. మళ్ళీ ఖాయిలా చేయలేదా అనేనా నీ అనుమానం—మంచి ప్రశ్నే! ఎందుకు చేస్తుంది?—మన జాగ్రత్తలో మనం ఉంటూంటే చేసినా మాత్రం ఏం? మనసంత పరవశం చేసుకునేటప్పుడు. మళ్ళా ఒళ్ళు చివుక్కుమన్నా - ఖాతర్ చేయం!

సెలవుల దోవను సెలవులు అయిపోయినాయి. యిక విధిలేక బండీయెక్కి కాలేజీ ముఖమైనాను—అవాంతరాలన్నీ గడచి అన్నీ బాగానే వున్నాయి. కాని రైలు కదలిన తరువాత ఎందుకో స్టేషనుకు వచ్చాడు కాబోలు మా మామగారికంట నేను,

నా కంటి ఆయన పడ్డాను. గుర్తుపట్టి కేక వేశాడు. నేను కిటికీలోనుంచి తలకాయ లోపలికి లాక్కున్నాను. దాని పుణ్యమా అంటూ వెంటనే బండీ దౌడుపుచ్చుకున్నది. అప్పటికి ఆ గండం గడచింది కదా అని గుండెలు కుదుటపడి, అమ్మయ్య అనుకున్నాను. బండికి భత్యం ఎక్కడిదని ప్రశ్నించబోకు. అక్కడే అరువు పెట్టాను అని విశదమయే ఉండాలి. ఈ రోజుకు మనం వెనుకటి బాపతు ఆ చిశాకు కొంత బాకీ.

ఆ దెబ్బ దెబ్బ, ఆరు నెలలు యింటికి వెళ్ళలేదు. ఇక చూసుకో అటూ యిటూ, మామగారూ, నాన్నా చెక్కుతూ ఉత్తరాలు వ్రాశారు. అన్నిటికీ ఒక్కటే సమాధానం. మన దగ్గిరనుంచి, మౌనం. ఈ లోపల వియ్యంకులు ఇద్దరూ ఒకరిమీద ఒకరు కత్తులు నూరుకున్నారు. ఉన్నవాడు ఊరుకోకుండా, మా మామగారు "అల్లుడికి మేము ఏం అపరాధం చేశామని అంత ఆగ్రహం? యీ ఊరువచ్చి మా యింటికి రాకుండా పోవడం? పండుగకు మీ రందరూ దయచేసినందుకు మాకు బ్రహ్మానందమే అయినా, అల్లుడురాని కొరత, మనం ఉభయులమూ ఫీల్ అయినాము. ఎందుకు రాలేదో కారణం, అప్పుడు మీరు చెప్పకపోయినా యిప్పటికైనా మీకు తెలిసి ఉంటుందనుకుంటాను" అని మూడు తావుల గ్రంథం పెంచి వ్రాశారు. దానితో మా నాన్నకు రేగింది. నా మీద నేరారోపణ చేసినట్లు ఆయన ఎంచుకుని, మనం చేసిన నిర్వాహకం ఆయనకు తెలియదుకాదూ, లడాయికి లంకించుకున్నాడు. కొన్నాళ్లు అలా పోస్టుద్వారా సంగ్రామం జరిగి, తరువాత దానంతట అదే చల్లారిందనుకో - నేను ఆ ప్రాంతాలకి ఆ రోజుల్లో వెళ్ళనేలేదనీ, మామగారు చూడటం పొరబాటుకొద్దీ ఎవరినో నన్ను అనుకుని వుంటారనీ, మా నాన్నను యింటికి వెళ్ళినప్పుడు నమ్మించడం పెద్ద కష్టం కాలేదు.

అంతటితో కథ పూర్తి అయిందనుకుంటున్నావేమో? మా పినమామగారు వేయిళ్ళ పూజారి. గ్రేట్ వార్‌కు పూర్వం కళ్యాణి తల్లికి ఆయన కన్నెరికం పెట్టాడట. ఆ వరికమీద అప్పుడప్పుడు ఆయన వాళ్ళయింటికి పోయిరావడం కద్దు. అక్కడ మన ఛాయాచిత్రం ఆ దేవుడు సందర్శించడం కలిగింది. గడుసుతనంగా కళ్యాణినేమీ అడగకుండా ముసలి—సరసిని కదలేసి యావత్తూ కనుక్కుని సమగ్రంగా అన్నగారికి



వేయిళ్ళ పూజారి

నివేదించాడు. మళ్ళా పెద్ద రసికుడని పేరు. చూడబోతే యిదీ ప్రమోజకత్వం! ఆయన విని ఊరుకోకుండా కళ్యాణి యింటికెళ్ళి కరవ వచ్చినట్లు నానా హంగామా చేశాడుట. మొదట మా బంధుత్వాన్నిబట్టి చాలా మరియాదగానే మాట్లాడిందట. కాని అయినకాడికి ఆయన రెచ్చిపోవడం చూసి - మీరెవ్వన్నా అనండి. ఆయన్ని నా యింట్లో కట్టేసుకున్నాను. వస్తే నాకోసం ఆయన వస్తారుకాని మీకోసం కాదు ఇహ." అని ఆయనకన్న పెద్ద గొంతు చేసుకున్నదట! "నా పిల్లదాని కాపురం తీసేస్తున్నావు. దాని ఉసురు నీకు తగులుతుంది" అని మా మామగారంటే, కళ్యాణి "అది మా యింటా వంటా లేదు. మా యింటికి వచ్చినవాళ్ళు ఎవరు చెడిపోయి నారు? - మీ తమ్ముడు మహారాజులాగా లేడా? నేనన్నది మీకు అర్థంకాక, సానికదా అని తేలికగా అనేశారు. అది కూడదు సుమండీ! నా అభిప్రాయం మీ పిల్లది కాపురానికి ఆయన దగ్గరకే వెళతుజెది అని" యిత్యాదయః. దానితో పచ్చివెలక్కాయ గొంతున పడినట్లు జవాబు చెప్పడం చేతకాక మదీయశ్వశురుండు—గృహాభిముఖుండై నాడు.

ఇదంతా కళ్యాణి నాకు వ్రాసింది. నేను శహబాస్ అంటూ నీవు చేసింది నాకు నచ్చింది అని జవాబు వ్రాశాను. అసలు ఆ ఫోటో మా గృహిణికి బహూకరించ వలెనని పట్టుకు వెళ్ళింది. సద్వినియోగమే జరిగిందనుకో. కాని దాని ఆధారాన ఉత్తర కాండ నడవడం— మొదట్లో కొంచెం కష్టం వేసింది. యిప్పుడా చీకూ చింతా యేమీలేదు. ఒక్కటే రంధి. ఆయన ఆ ఊరునుంచి బదిలీ అయితేనేగాని నన్ను పండుగకు పిలువడు. వస్తే అక్కడ చిక్కబడి బయటకు రానని ఆయనకు భయం. నా అంతట నేను వెళితేనో అంటే, తాను నిమిత్తం కాకుండా వుంటే ఎవరి పాపం వారిది. అలా సర్దుకు పోగలడులే. వేదాంతి కొద్దో గొప్పో - ఏం ఎలా వుంది?"

"నమ్మశక్యంగాకుండా ఉంది."

"నాకూ అలాగే ఉంటుంది, యిప్పుడు తలుచుకుంటుంటే."

"అయితే నిజం. మరి ఆ తరువాత—"

"తమామ్— షుద్."